వైన్స్‌లో చోరీ కేసులో నిందితుల కోసం గాలింపు

లక్షెట్టిపేట, డిసెంబర్ 24: నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో వైన్స్ దుకాణంలో రెండు రోజుల క్రితం చోరీ జరిగింది. సీఎం కెమెరాలో రికార్డయిన కారు నంబర్ ఆధారంగా నిందితులు లక్షెట్టిపేట వాసులేనని భైంసా పోలీసులు గుర్తించారు. సుమారు ఐదుగురు యువకులు లక్షెట్టిపేట పట్టణంలో కారులో బైంసాకు వెళ్లి చోరీకి పాల్పడ్డారు. మద్యం దుకాణంలో చొరబడి మద్యం బాటిళ్లతో పాటు దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలను కూడా దొంగిలించి తీసుకువచ్చారని పోలీసులు తెలిపారు. దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు భైంసా పోలీసులు అక్కడ ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా కారు నంబర్‌ను గుర్తించి చోరీకి పాల్పడిన వ్యక్తుల కోసం గాలిస్తున్నారు. ఈ కేసులో అంబులెన్స్ డ్రైవర్‌ని అదుపులోకి తీసుకొని విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

లక్షెట్టిపేట, డిసెంబర్ 24: మండలంలోని చందారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు పొన్నం వెంకాగౌడ్(62) తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందినట్లు ఎస్ఐ లక్ష్మణ్ ఆదివారం తెలిపాడు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం వెంకాగౌడ్ లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని ఊత్కూర్‌లో గది అద్దెకు తీసుకుని కుల వృత్తి చేస్తున్నాడు. శనివారం సాయంత్రం కల్లు గీస్తుండగా తాటిచెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడగా స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కూతురు పొన్నం మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నాడు.

కిరాణా షాపులో చోరీ

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 24: సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని సీఐఎస్ఎఫ్ క్యాంపు ముందు ఉన్న కిరాణం షాపులో చోరీ జరిగింది. కిరాణం షాపు యజమాని అమర్ కుమార్ పోద్దార్ ఈ నెల 23న షాపు మూసివేసి శ్రీరాంపూర్‌లో జరిగిన సింగరేణి డే వేడుకలకు వెళ్లాడు. అక్కడి నుంచి తాను నివాసం ఉంటున్న సీసీసీ విద్యానగర్‌కు వెళ్లాడు. 24న ఉదయం షాపు తీసి చూసేసరికి వెనుక డోర్ ఓపెన్ చేసి ఉంది. షాపులోని సామగ్రి అంతా చిందరవందరంగా పడి ఉంది. చోరీ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించాడు. షాపులోని రూ.8 వేల నగదు, రూ.9వేల విలువైన సిగరేట్ ప్యాకెట్లు, రూ.2వేల విలువైన బిస్కెట్లు, చాక్లెట్లు, స్నాక్స్ ప్యాకెట్లు ఎత్తుకెళ్లారని బాధితుడు అమర్ కుమార్ పొద్దార్ తెలిపారు. తులం బంగారం కూడా కనబడడం లేదని, చోరీ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఓటరు నమోదుకు 5వ తేదీ వరకు గడువు

కోటపల్లి, డిసెంబర్ 24 : నూతన ఓటరు నమోదుకు ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించింది. 2024 జనవరి 1 వరకు 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులు కాగా జనవరి 5వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ సూచించింది. ప్లారమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలు నేపథ్యంలో 6న మసాయిదా ఓటరు జాబితా, 22 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. తుది ఓటరు జాబితా ఫిబ్రవరి 8న ప్రకటించనున్నారు. ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు, పేర్ల తొలగింపునకు బీఎల్వోలతో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు.

ముగిసిన ఎక్కాహం

చెన్నూర్ టౌన్, డిసెంబర్ 24 : చెన్నూర్ పట్టణంలోని బడాహనుమాన్ మందిర్‌లో ఎక్కాహం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం 24 గంటల పాటు నిరాటంకంగా కొనసాగింది. ఆదివారం మధ్యాహ్నం ఎక్కాహం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శ్రీరాంభట్ల శంకర్ శర్మను ఘనంగా సత్కరించారు. అప్పాల సత్యవర్ధన్ కుటుంబీకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు అంతా సిద్ధం

కాసిపేట, డిసెంబర్ 24 : క్రిస్మస్ పండుగకు సోమగూడెం, బెల్లంపల్లి రహదారి మధ్యలోని కల్వరీ చర్చి సిద్ధమైంది. ఆదివారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. ఈ ప్రాంతంలో అతి పెద్ద చర్చి కల్వరీ కావడంతో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు తరలివస్తారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చర్చిల్లో క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

కల్వరీలో 50 రోజుల ఉపవాస దీక్షలు ప్రత్యేకం...

కల్వరీ చర్చికి ఈ ప్రాంతం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి క్రైస్తవులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ప్రతి ఏడాది 50 రోజుల పాటు ప్రవీణ్ పాస్టర్ చేసే ఉపవాస దీక్షల కార్యక్రమం ఇక్కడ ప్రత్యేకత చాటుకున్నది. 50 రోజులు ఉపవాస దీక్షలు చేసి దీక్షల ముగింపు సభ భారీ స్థాయిలో నిర్వహిస్తారు. ఈ సభకు భారీ సంఖ్యలో క్రైస్తవులు దేశ నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చి ప్రార్థనలు చేస్తారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, సేవా దృక్పథంతో ఉండాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు కల్వరీ పాస్టర్ ప్రవీణ్, కల్వరీ నిర్వాహణాధ్యక్షురాలు సిస్టర్ షారోన్ తెలిపారు.

వైభవంగా క్రిస్మస్ ఈవ్

లక్షెట్టిపేట, డిసెంబర్ 24: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో శనివారం రాత్రి క్రిస్మస్ ఈవ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చి ఫాదర్ డెవిడ్ ఫాల్ మాట్లాడుతూ క్రిస్మస్ ఈవ్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం భక్తులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు చేసిన ప్రోగ్రాంలను తిలకించి, ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులను మనస్ఫూర్తితో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో చర్చి కమిటీ మెంబర్స్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి.

మందమర్రి, డిసెంబర్ 24: మందమర్రి పట్టణంలో క్రిస్మస్ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని వివిధ ఏరియాల్లో చర్చిలను కమిటీ సభ్యులు విద్యుత్ దీపాలతో అలంకరించారు. రంగురంగుల పూలతో ఆకర్షణీయంగా అలంకరించారు. చర్చిల ఆవరణలో క్రీస్తు జననానికి ప్రతీకగా ఏర్పాటు చేసిన పశువుల పాకలను వేసి పూలు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. షామీయానాలను వేయడంతో పాటు తాగునీటిని అందుబాటులో ఉంచుతున్నట్లు కమిటీల సభ్యులు తెలిపారు. సీఎస్ఐ చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన పశువుల పాక వద్ద ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రామకృష్ణాపూర్‌లో..

రామకృష్ణాపూర్, డిసెంబర్ 24: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ సీఎస్ఐ చర్చిలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పేద క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆదివారం క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌లు రామకృష్ణాపూర్ సీఎస్ఐ చర్చిని సందర్శించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్‌చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధులకు చీరెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ జాషువా, మెదక్ చర్చి సెక్రటరీ డొలకల డేవిడ్, గుండమల్ల పుష్పరాజ్ ఆనంద్, ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు జనక్ ప్రసాద్, కాంపెల్లి సమ్మయ్య, తేజావత్ రాంబాబు, పలిగిరి కనకరాజ్, మారెపల్లి రాజయ్య, జంగంపల్లి మల్లయ్య, ఉప్పులపు సురేశ్ తదితరులున్నారు.

కాసిపేట : క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన కల్వరీ చర్చి

మందమర్రిలో విద్యుత్ కాంతుల్లో సీఎస్ఐ చర్చి

రామకృష్ణాపూర్ : క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, వినోద్

ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పనులు వేగవంతం చేయాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్
- దుబ్బ గూడెం నిర్వాసిత ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పనుల పరిశీలన

కాసిపేట : ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

కాసిపేట, డిసెంబర్ 24 : సింగరేణి ఓపెన్ కాస్ట్ నిర్వాసిత గ్రామమైన దుబ్బ గూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేర్కొన్నారు. ఆదివారం కాసిపేట మండలంలోని దుబ్బగూడెం గ్రామానికి చెందిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పనులు పెద్దనపల్లి బైపాస్ రోడ్డు వద్ద బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పరిశీలించారు. ఓసీలో దుబ్బగూడెం గ్రామం నష్టపోతుండగా వారికి పెద్దనపల్లి శివారు బైపాస్ రోడ్డు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, గ్రామస్తులు బోగె రామకృష్ణ, శ్రీనివాస్, కమలాకర్, పులి శ్రీనివాస్, రాంటెంకి రాజు, టింకు, మహేశ్ తదితరులున్నారు.

ఇటు పనులు.. అటు పగుళ్లు..

- బీటీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు తూట్లు..
- గ్రామస్తుల ఆగ్రహం

దండేపల్లి, డిసెంబర్ 24: ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలాది రూపాయల నిధులు మంజూరు చేస్తుండగా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత కరువైపోయిందని గ్రామస్తులు మండిపడుతున్నారు. దండేపల్లి మండల కేంద్రం నుంచి నర్సాపూర్ వరకు రూ.48.60 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో బీటీ రోడ్డు నిర్మిస్తున్నారు. పనులు రెండు నెలల క్రితమే ప్రారంభించగా, శనివారం రోడ్డుపై తారు వేసే పనులు ప్రారంభించారు. ఆదివారం తెల్లారేసరికి గ్రామస్తులకు పగుళ్లు కనిపించాయి. పగుళ్లు ఏర్పడిన కొన్ని చోట్ల కంకర వేసి పూడ్చుతున్నారు. పనులు జరుగుతున్నప్పుడే ఇలా పగుళ్లు ఏర్పడితే రాబోయే రోజుల్లో పరిస్థితి ఏమిటని గ్రామస్తులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని, రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరుతున్నారు.

నర్సాపూర్ వద్ద పగుళ్లు తేలిన బీటీ రోడ్డు

అల్పాహారం పంపిణీ

బెల్లంపల్లి, డిసెంబర్ 24: తిలక్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అల్పాహారం అందించారు. పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, నిరుపేదలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రత్నం రాజన్న, కంటెవాడ నగేశ్‌కుమార్, గెల్లి జయరాం యాదవ్, గరిగే వేణు, గరిగే రాజ్‌కుమార్, గంట శ్రీనివాస్, దాసి శ్రీనివాస గోవర్ధన్, కందుల సత్తయ్య, కీర్తి మల్లేశ్, శంకర్‌గౌడ్, కనకయ్య గౌడ్, మేకల రాజయ్య, నాగుల లింగయ్య, గురుస్వామి, వెంకటస్వామి, కందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ విజయానికి కృషి చేయాలి

- యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు మంద మల్లారెడ్డి, డీకొండ అన్నయ్య

మాట్లాడుతున్న నాయకులు

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 24: గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ విజయం కోసం కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు మంద మల్లారెడ్డి, డీకొండ అన్నయ్య కోరారు. ఆదివారం నస్పూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో టీబీజీకేఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్‌లో నెలకొన్న పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణకు ఆజ్యం పోసింది ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ యూనియన్లేనని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి సంస్థ లాభాల్లోకి దూసుకెళ్లిందని, లాభాల నుంచి 32శాతం వాటాను కార్మికులకు ఇచ్చినట్లు తెలిపారు. కోలిండియాలో లేని హక్కులను సింగరేణి కార్మికులకు కేసీఆర్ కల్పించారని, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను కేసీఆర్ ప్రభుత్వం కారుణ్యం పేరుతో పునరుద్ధరించి కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు కల్పించారన్నారు. ఏఐటీయూసీ గాని ఐఎన్‌టీయూసీ గాని సింగరేణిలో గెలిస్తే కారుణ్య నియామకాలు రద్దు అవుతాయన్నారు. కార్మికులంతా విజ్ఞతతో ఆలోచించి హక్కులు సాధించిన టీబీజీకేఎస్ యూనియన్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు పెట్టం లక్ష్మణ్, పానుగంటి సత్తయ్య, కట్కూరి రత్నాకర్‌రెడ్డి, సాదుల భాస్కర్, సదానందం, వెంకట్‌రెడ్డి, బుద్ధి ప్రసాద్, పుప్పాల సంపత్, మారం శ్రీనివాస్, రవిచందర్, ఉత్తేజ్ రెడ్డి, సతీశ్, నరేశ్, గోనె స్వామి, బానోత్ రాజునాయక్, హరీశ్, తిరుపతిరెడ్డి, బిరుదు శ్రీను, తదితరులున్నారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజ

చెన్నూర్‌లో శోభాయాత్రలో నృత్యం చేస్తున్న మహిళలు, అయ్యప్ప దీక్షాపరులు

చెన్నూర్ టౌన్, డిసెంబర్ 24 : చెన్నూర్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల (హైస్కూల్ గ్రౌండ్)లో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప పడిపూజ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. సహస్ర కలశాభిషేకంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం అయ్యప్ప ఆలయం నుంచి హైస్కూల్ గ్రౌండ్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం కేరళకు చెందిన శ్రీ సంజీవ్ నంభూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో మహా పడిపూజ, అగ్నిగుండాల ప్రవేశం అల్పాహారం, ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది.

తాండూర్‌లో..

తాండూర్, డిసెంబర్ 24 : మండలంలోని బోయపల్లి గ్రామంలో శనివారం రాత్రి బుగ్గ దేవస్థానం చైర్ పర్సన్ మాసాడి శ్రీదేవి శ్రీరాములు ఇంటి వద్ద అయ్యప్ప స్వామికి పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. గురుస్వామి విష్ణు ఆధ్వర్యంలో పూజలు లుచేశారు. ఈ కార్యక్రమం లో గురు స్వాములు సత్యనారాయణ, తిరుపతి, శ్రావణ్, చంద్రయ్య, మల్లేశ్, కన్నె, కత్తి, గంట, గదా స్వాములు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

మందమర్రి, డిసెంబర్ 24: మందమర్రి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1990-91 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక మంజునాథ గార్డెన్స్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బైరం రాము, ఏడుకోళ్ల పవన్, పారుపల్లి సంజీవ్, కుర్ర శ్రీనివాస్, యోగానంద్, దాసరి రాజనర్సు, ఉప్పులేటి నరేశ్, అంతడుపుల నాగరాజు, ఒడ్డె శ్రీనివాస్(అమెరికాలో సైంటిస్ట్), మట్టపర్తి వెంకటేశ్వర్లు, కొత్తపల్లి రమేశ్, పార్వతి విజయ, రాజేశ్వరి, ప్రసన్న, శారద, ధనలక్ష్మి, సుజాత, యశోద, ప్రభావతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వరి కోత యంత్రాలకు భలే గిరాకీ

- హార్వెస్టర్ల వినియోగంపైనే రైతుల ఆసక్తి
- తక్కువ వ్యయం, త్వరగా పంట చేతికి..

తాండూర్/వేమనపల్లి, డిసెంబర్ 24 : వ్యవసాయరంగంలో ప్రతి సంవత్సరం నూతన మార్పులు వస్తున్నాయి. కూలీల కొరత కారణంగా రైతులు యంత్రాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వరి చేలు ఒకే సారి కోతకు రావడంతో కోత యంత్రాలకు గిరాకీ పెరిగింది. కూలీలకు బదులు యంత్రాలతో గంటల వ్యవధిలోనే పంట ఉత్పత్తులు చేతికి అందివస్తుండడంతో రైతులు ఈ యంత్రాల వైపే మొగ్గుచూపుతున్నారు. ఈ సంవత్సరం కొంత ఆలస్యమైనప్పటికీ సమృద్ధిగా వర్షాలు కురవడంతో బావులు, చెరువులు, కుంటల కింద ఒకేసారి రైతాంగం వరి సాగుకు చేశారు. దాదాపు వరి ఒకేసారి కోతకు రావడంతో యంత్రాలకు భలే గిరాకీ వచ్చింది. రాష్ట్రం నుంచి గాక ఆంధ్రప్రదేశ్, తమిళనాడు నుంచి వరికోత యంత్రాలు భారీగా తరలివచ్చాయి. అన్ని గ్రామాల్లో హార్వెస్టర్ యజమానులు యంత్రాలను ఇప్పటికే దింపారు. వరి కోసేందుకు గంటకు హార్వెస్టర్ యజమానులు రూ.2వేల నుంచి రూ.2300 తీసుకుంటున్నారు. చైన్ మిషన్‌కు మాత్రం రూ.3600 వరకు చార్జి చేస్తున్నారు. ఎకరం వరిని వరికోత యంత్రాలు రెండు గంటల్లోపు కోస్తున్నాయి. వరి కోత యంత్రాల విధానమే బాగుందని పలువురు రైతులు అంటున్నారు. కూలీల సహాయంతో కోతకోసి, కుప్ప పెట్టి, కుప్ప నూర్పిడి చేసే సరికి సుమారు ఎకరానికి రూ.8వేల నుంచి 9 వేల వరకు ఖర్చు వస్తుందంటున్నారు. యంత్రాల సహాయంతో కోస్తే వరిగడ్డి అక్కెరకు రాకుండా పోతుంది. గడ్డి అవసరమున్న రైతులు తప్ప మిగతా వారంతా వరి కోతయంత్రాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. రైతుల అవసరాలను గమనించిన హార్వెస్టర్ యజమానులు గ్రామానికి ఒకటి రెండు చొప్పున యంత్రాలను తీసుకువచ్చి సొమ్ముచేసుకుంటున్నారు. హార్వెస్టర్‌తో వరి కోయడంతో వెంటనే వడ్లు చేతికి వస్తుండడంతో ట్రాక్టర్‌లో కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు.

కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షించిన ప్రజలు

మందమర్రి, డిసెంబర్ 24 : తెలంగాణ ఉద్యమ కాలంతో పాటు రాష్ట్ర సాధన, అభివృద్ధి, సంక్షేమంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆదివారం వెల్లడించిన స్వేద పత్రం ప్రసారాలను మందమర్రి పట్టణ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ ఉద్యమ కాలంలో గత ప్రభుత్వాల నుంచి ఎదురైన ఆటు పోట్లను, రాష్ట్ర సాధన అనంతరం పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. స్వేద పత్రం సమర్పణ లైవ్ ప్రసారం కావడంతో పట్టణంలోని వివిధ కాలనీల్లో ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి టీవీల ముందు కూర్చొని ఆసక్తిగా వీక్షించారు. రాష్ట్రాన్ని అభాసు పాలు చేయడం, కొనసాగుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రస్తుత పాలకులు బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అప్పుల పాలైందని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పలువురు చర్చించుకోవడం కనిపించింది. పదేండ్లలో రాష్ట్రంలో జరిగిన ప్రగతిని కాంగ్రెస్ నాయకులు ఎందుకు వివరించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

భజన బృందానికి ప్రశంసాపత్రాలు

బెల్లంపల్లి, డిసెంబర్24: బెల్లంపల్లి వాసవి భజన బృందానికి శ్రీలంక టూరిజం అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రశంసాపత్రాలను అందించారు. వాసవి భజన బృందం శ్రీలంక యాత్రలో భాగంగా ప్రపంచ శాంతి కోసం శ్రీలంకలో 5 రోజుల పాటు దేవీ భాగవత ప్రవచనం, చండీ హోమం, 24 గంటల భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ వేదపండితుడు బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి, ట్రావెల్స్ యాజమాన్యం ప్రతినిధి జనక్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకుంది.

మల్లన్నకు మొక్కులు

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 24: షష్ఠి వారాల సందర్భంగా బ చెన్నూర్ మండలంలోని కత్తరశాల గ్రామంలో పూణ్యక్షేత్రం మల్లికార్జునస్వామి ఆలయంలో బోనాలు సమర్పించి, ఒగ్గు పూజారులతో ఆలయ ఆవరణలో పట్నాలు వేయించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. చెన్నూర్, కోటపల్లి, జైపూర్, భీమారం మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈవో రవి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

మానవీయ విలువలకు ప్రతీక 'లేదాళ్ల' కవితలు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

లక్షెట్టిపేట, డిసెంబర్ 24: మానవీయ విలువలకు ప్రతీకగా లేదాళ్ల రాజ్యేశ్వర్‌రావు కవితలు నిలుస్తాయని ప్రముఖ కవి మునిమడుగుల రాజారావు అన్నారు. లక్షెట్టిపేట పట్టణంలోని గుడ్ షెఫర్డ్ పాఠశాలలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో శనివారం లేదాళ్ల రాజేశ్వర్‌రావు రచించిన 'అమ్మకు ఒక జత చెప్పులు కొనాలి' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆయన రాసిన కవితలు కందిలి, మౌనమూర్తి, తదితర పుస్తకాలున్నాయని తెలిపారు. అనంతరం కవి లీలాదేవి పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల విద్యాధికారి విజయ్‌కుమార్, గోపగాని రవీందర్, కందుల తిరుపతి, అల్లాడి శ్రీనివాస్, సూది రెడ్డి నరేందర్‌రెడ్డి, సుబ్బాయమ్మ, నూటెంకి రవీంద్ర, రాచకొండ శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, జనార్దన్, యోగేశ్వర్, చక్రవర్తి, మల్లేశం, వినయ్ కుమార్, సరిత, భూపతి, జయ, రమణశ్రీ, భారతి, వామన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం

మంచిర్యాల ఏసీసీ, డిసెంబర్ 24 : మంచిర్యాల జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు దండనాయకుల వామన్ రావు, ప్రచార కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్థ గౌరవ అధ్యక్షుడు బిజుముళ్ల ఆనందరావు, సంగీత సాహిత్య సుధావాహిని అధ్యక్షుడు డా.దాసరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బెల్లాల సుగుణాకర్, ప్రచార కార్యదర్శి భూపతి సంతోష్, గొళ్లపల్లి బ్రహ్మచారి, కవులు వారి కవితాగానాలను వినిపించారు.

దుప్పట్లు పంపిణీ

దండేపల్లి, డిసెంబర్ 24 : దండేపల్లి మండలంలోని లింగాపూర్ జీపీ పరిధిలోని బిల్కుగూడ గిరిజన గ్రామంలో ఆదివారం గిరిజనులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 17 కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాదంశెట్టి మల్లికార్జున్, కుంచె కిషన్, ఉపాధ్యక్షుడు బొలిశెట్టి రాజన్న, మాజీ అధ్యక్షుడు అన్నం సత్యనారాయణ, జాబు, సుగుణాకర్, కొండు రామన్న, నర్సింగ్ నాయక్, శివలాల్, రాజన్న, ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

జైపూర్, డిసెంబర్ 24: చెన్నూర్ పట్టణానికి చెందిన దుర్గం లక్ష్మి తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఉదయం మండలంలోని కుందారంలో మల్లికార్జునస్వామి ఆలయానికి మొక్కులు చెల్లించుకునేందుకు ఆటోలో వెళ్లింది. ఈ క్రమంలో పర్సు దారిలో పడిపోయింది. అందులో రెండు తులాల బంగారం సెల్‌ఫోన్ ఉండగా బాధితురాలు జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎస్ఐ ఉపేందర్ సిబ్బందిని పంపించి వెతకగా శెట్‌పల్ల